జగనన్నతోనే సంక్షేమం, అభివృద్ధి

- అవి కొనసాగాలంటే జగనన్నే మళ్లీ సీఎం కావాలి
- చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితి లేదు
- టీడీపీ ప్రభుత్వమంటేనే రౌడీల రాజ్యం
- గతంలో జన్మభూమి కమిటీలు చేసిన అకృత్యాలను ప్రజలు ఇంకా మర్చిపోలేదు
- వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్


ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గుంటూరు రూరల్: జగనన్నే మనకు మరోసారి ముఖ్యమంత్రి కావాలని సంక్షేమం అభివృద్ధి జగనన్నతోనే సాధ్యమని పత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని వికాస్‌నగర్‌లోగల క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ నాయకులు, బూత్ స్థాయి నాయకుల సమావేశంలో ఆయన రానున్న ఎన్నికలపై నేతలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరం సమష్టిగా కృషిచేసి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సైనికుల్లా పనిచేద్దామన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేసేందుకు ప్రతిఒక్కరూ సిద్ధంగా ఉండాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేశారన్నారు. తల్లి కడుపులోని బిడ్డనుంచి ఆశీర్వదించే అవ్వాతాతల వరకూ ప్రతి ఒక్కరికీ ఇంటివద్దకే సంక్షేమ పథకాలను అందించారన్నారు. చంద్రబాబు, అతని తొత్తు పార్టీలు జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను దోచుకున్నారని గుర్తు చేశారు. జగనన్న ముఖ్యమంత్రిగా ఉంటేనే ప్రజలు సంతోషంగా ఉంటారన్నారు. ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు, తొత్తు పార్టీలు అన్ని కలిసి ప్రజలకు కల్లబొల్లి హామీలు ఇస్తున్నారన్నారు. ప్రజలు చంద్రబాబును నమ్మే పరిస్థితిలో లేదని గుర్తు చేశారు. టీడీపీ ప్రభుత్వం అంటేనే రౌడీల రాజ్యమన్నారు. సామాన్య ప్రజలు బతికే అవకాశం ఉండదని ప్రజలు గుర్తించాలన్నారు. బూత్ కమిటీల నుంచి కార్యకర్తల వరకూ ప్రతిఒక్కరూ జగనన్న చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు తెలియజేయాలన్నారు. భారతదేశ చరిత్రలో ఎన్నడూలేని విధంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు 99 శాతం అమలు చేసిన ఏకైక నాయకుడు మన జగనన్న అని తెలిపారు. మాట ఇచ్చాడంటే చేసి తీరుతాడని ప్రతి కార్యకర్తకూ ఆయన అండగా ఉంటారని గుర్తు చేశారు. జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్పొరేటర్లు, పలు డివిజన్‌ల కన్వీనర్లు, సొసైటీ చైర్మన్‌లు, డైరెక్టర్‌లు, అనుబంధ విభాగాల నాయకులు, పలు కార్పొరేషన్‌ల డైరెక్టర్‌లు, గృహ సారధులు, సచివాలయం కన్వీనర్లు, సోషల్ మీడియా కన్వీనర్లు, జేసీఎస్ కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం

ట్రైనీ డీఎస్పీ పి.గీత

ప్రత్తిపాడు: ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా పోలీసుశాఖ సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించిందని ట్రైనీ డీఎస్పీ పి.గీత అన్నారు. మండల పరిధిలోని సమస్యాత్మక గ్రామాలైన పాతమల్లాయపాలెం, కొత్తమల్లాయపాలెం, గనికపూడి గ్రామాల్లో శనివారం సాయుధ పోలీసు బలగాలతో పోలీసు కవాతు నిర్వహించారు. ట్రైనీ డీఎస్పీ గీత, ప్రత్తిపాడు ఎస్‌ఐ సోమేశ్వరరావులు ప్రత్యేక బలగాలతో కలిసి గ్రామాల్లో కవాతు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

క్షయను అంతమొందిద్దాం

గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మేరి యునిస్


ఈదులపాలెంలో క్షయ అవగాహన ర్యాలీ

ప్రత్తిపాడు: క్షయను అంతమొందించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని గొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మేరి యునిస్ తెలిపారు. ఈ నెల 24వ తేదీన ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా శనివారం గొట్టిపాడు పీహెచ్‌సీ పరిధిలోని యనమదల, ఈదులపాలెం, తుమ్మలపాలెం గ్రామాల్లో వైద్యాధికారి మేరియునిస్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. టీబీ ఓడిపోతుంది, దేశం గెలుస్తుంది.. ఇదే సమయం క్షయను అంతమొందించడానికి.. అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ మేరియునిస్ మాట్లాడుతూ దేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద ప్రజారోగ్య ప్రాణాంతక సమస్య క్షయ అని తెలిపారు. మైకో బ్యాక్టీరియం ట్యూబర్క్యులోసిస్ అనే సూక్ష్మక్రిమి వలన వ్యాధి సోకుతుందని చెప్పారు. ఈ క్రిమి రోగి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు, తుంపర్ల ద్వారా ఎదుటి వారికి సోకుతుందన్నారు. వారానికి మించి దగ్గు, కళ్లెలో రక్తం పడటం, వారాలకు మించి జ్వరం, బరువు తగ్గడం, ఛాతీ ఎక్సరేలో మార్పులు వంటివి కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి మెరుగైన చికిత్స తీసుకోవాలని యునిస్ తెలిపారు. అదే విధంగా తుమ్మలపాలెంలో ఎంపీహెచ్‌ఈఓ చెల్లమ్మ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేశారు.

క్రిటికల్ పోలింగ్ స్టేషన్లలో వెబ్‌కాస్టింగ్

ప్రత్తిపాడు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి.శ్రీకర్


పాతమల్లాయపాలెంలో పోలింగ్ స్టేషన్లను పరిశీలిస్తున్న పి.శ్రీకర్, తహసీల్దార్ ఎం.పద్మజ

ప్రత్తిపాడు: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు క్రిటికల్ పోలింగ్ స్టేషన్లలో పోలింగ్ మొదలైన సమయం నుంచి ముగిసేవరకు నిరంతరాయంగా వెబ్‌కాస్టింగ్ జరిగేలా అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామని ప్రత్తిపాడు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి.శ్రీకర్ అన్నారు. మండల పరిధిలోని నడింపాలెం, చినకోండ్రుపాడు, పాతమల్లాయపాలెం, గొట్టిపాడు గ్రామాల్లోని క్రిటికల్ పోలింగ్ స్టేషన్లను శనివారం సాయంత్రం ఆయన స్థానిక తహసీల్దార్ పద్మజతో కలిసి పరిశీలించారు. పోలింగ్ స్టేషన్లలో విద్యుత్, ర్యాంప్, మరుగుదొడ్లు, తాగునీరు, ఇంటర్నెట్.. వంటి సౌకర్యాలున్నాయా? లేవా అన్న అంశాలను నిశితంగా పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రాల వద్ద కల్పించాల్సిన సౌకర్యాలు, తీసుకోవలసిన చర్యలను తహసీల్దార్‌కు వివరించారు. ఈ సందర్భంగా శ్రీకర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ క్రిటికల్ పోలింగ్ స్టేషన్లకు సంబంధించి జారీచేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఆయా పోలింగ్ కేంద్రాల్లో పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందులో భాగంగానే కేంద్రాలను పరిశీలిస్తున్నామని వివరించారు. వెంట ఎన్నికల డీటీ సుభాష్, ఆర్‌ఐ సాహితి, వీఆర్వోలు, వీఎల్ఓలు ఉన్నారు.

క్లుప్తంగా

రేపు పెదనందిపాడులో ఉచిత వైద్యశిబిరం

ప్రత్తిపాడు: మండల కేంద్రం పెదనందిపాడులో ఈ నెల 25వ తేదీన శ్రీ లౌక్య హెల్త్ కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వైద్యులు గైనకాలజిస్ట్ డాక్టర్ చెన్నుపాటి రాధిక, జనరల్, షుగర్ వ్యాధి నిపుణురాలు డాక్టర్ ముత్తవరపు రాజ్యలక్ష్మిలు తెలిపారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం సమీపంలో నర్రా బాలకృష్ణ నివాసంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆస్పత్రిలో శనివారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. వైద్యులు రాధిక, రాజ్యలక్ష్మిలు మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరాన్ని నిర్వహించనున్నామని చెప్పారు. పెదనందిపాడు, కాకుమాను, పర్చూరు మండలాల ప్రజలు క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తల్లిపాలు శిశువుకు శ్రేష్టం

కొల్లిమర్ల(కాకుమాను): అప్పుడే పుట్టిన శిశువు మొదలుకుని రెండు సంవత్సరాల వరకు ఆహారంతో పాటు తల్లిపాలు తప్పనిసరిగా ఇవ్వాలని ఐసీడీఎస్ పాండ్రపాడు సెక్టార్ సూపర్‌వైజర్ వెంకాయమ్మ అన్నారు. పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొల్లిమర్ల అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాలు, పోషకాహారంపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వెంకాయమ్మ మాట్లాడుతూ శిశువుకు రెండు సంవత్సరాల వరకు తల్లిపాలతో పాటు మంచి పోషక విలువలు ఉన్న ఆహారాన్ని ఇవ్వాలని అప్పుడే వయస్సుకు తగిన ఎత్తు, బరువు ఎదుగుదల ఉంటుందని ఆమె తెలిపారు. శిశువుతో పాటు తల్లి కూడా ప్రతి రోజు ఆకు కూరలతో పాటు పాలు, కోడిగుడ్డు తీసుకోవాలని దీని ద్వారా రక్తహీనత లోపించకుండా ఉంటారని ఆమె సూచించారు. ఈసందర్భంగా తల్లులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. మహిళా పోలీస్ పున్నమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, పాల్గొన్నారు.

విలువ ఆధారిత పదార్థాలపై శిక్షణ తరగతులు



గుంటూరు రూరల్: లాంఫాం కృషి విజ్ఞాన కేంద్రంలో గత వారంరోజుల నుంచి జరుగుతున్న విలువ ఆధారిత పదార్థాలపై శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎమ్.గంగాధర్‌కుమార్ మాట్లాడుతూ యువత కోసం ఏర్పాటు చేసిన ఇటువంటి నైపుణ్య శిక్షణ కార్యక్రమాల ద్వారా ఉపాధి చేపట్టేందుకు వీలుకలుగుతుందన్నారు. పండ్లు, కూరగాయలతో ఇంటి దగ్గరే నాణ్యమైన పదార్థాలతో ఆరోగ్యం మెరుగుపరుచుకోవచ్చని తద్వారా ఉపాధిని పొందవచ్చన్నారు. ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.రామాంజనేయులు మాట్లాడుతూ యువతకోసం ఇంకా ఇటువంటి శిక్షణ కార్యక్రమాలను కేవీకే సమన్వయంతో చేపట్టటం జరుగుతుందన్నారు. స్వయం ఉపాధి కోసం యువత శిక్షణ పొంది స్వయంగా వ్యాపారాలు చేసుకునేందుకు ఈ తరగతులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. సమేతి ఏడీఏ పుణ్యవతి కూరగాయలు, పండ్లతో ఎన్నోరకాల విలువ ఆధారిత పదార్థాలు తయారు చేసే విధానాలను వివరించారు. శిక్షణ పొందిన యువకులకు సర్టిఫికెట్లను అందజేశారు. కోర్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం.దీప, శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి కొరిటెపాడులో తిరునాళ్లు

పాత గుంటూరు: కొరిటెపాడు ఆంజనేయపేటలోని శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య స్వాముల తిరునాళ్ల మహోత్సవాలు ఈ నెల 25నుండి 29 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వహకుడు కన్నసాని విజయ్ కుమార్ ప్రకటనలో తెలిపారు. 25న స్వామివార్ల ఊరేగింపు, 26న అమ్మవారికి, స్వామికి అభిషేకము, 27న ముత్తయిదువులకు పసుపు కుంకుమ గాజులు పంపిణీ, 28న సువాసీనులచే కుంకుమ పూజలు, 29న అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

3న ఉచిత సామూహిక ఉపనయనాలు

గుంటూరు మెడికల్: బ్రాహ్మణ సేవాసమితి ఆధ్వర్యంలో ఏప్రిల్ 3న ఉచిత సామూహిక ఉపనయనాలు చేస్తున్నట్లు సేవాసమితి కార్యదర్శి తుళ్లూరు ప్రకాష్ చెప్పారు. ఈమేరకు శనివారం స్థానిక బ్రాడీపేటలోని సేవాసమితి కార్యాలయంలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ ఉపనయనాలు చేయించుకునే వారు మార్చి 25న సాయంత్రంలోపు బ్రాడీపేట 1వలైనులోని బ్రాహ్మణ సేవాసమితి కార్యాలయంలో వటువు పేరు నమోదు చేయించుకోవాలన్నారు. కేవలం బ్రాహ్మణులకు మాత్రమే ఈ అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు కమిటీ కన్వీనర్ కర్లపాలెం బాలకృష్ణ 9440041241, కమిటీ కార్యాలయం 7013256879 నంబర్లకు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కోశాధికారి కర్లపాలెం బాలకృష్ణ, కార్యవర్గ సభ్యులు పొత్తూరి మురళీమోహన్‌రావు, వి.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీలో గోపీచంద్ ఎండోమెంట్ లెక్చర్


కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.గోపీచంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

గుంటూరు రూరల్: ఆధునిక టెక్నాలజీ సహాయంతో రోగికి మెరుగైన వైద్యసేవలు అందించడంలో ఇంజినీర్ విద్యార్థుల నూతన ఆవిష్కరణలే ముఖ్య కారణమని ప్రముఖ ఈఎన్‌టీ సీనియర్ వైద్య నిపుణుడు డాక్టర్ విద్యాసాగర్ రామకృష్ణన్ తెలిపారు. శనివారం చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ప్రొఫెసర్ కె.గోపీచంద్ ఎండోమెంట్ లెక్చర్–2024 కార్యక్రమంలో బయోమెడికల్ ఎలక్ట్రానిక్స్ అడ్వాన్స్‌మెంట్స్ ఫర్ ఈక్విటబుల్ యాజెస్ టు ఈఎన్‌టీ కేర్ అనే అంశంపై ఆయన మాట్లాడారు. ఆధునిక వైద్య పరికరాలు వాటి పనితీరు, టెక్నాలజీ ఆధారంగా రోగ నిర్ధారణ ప్రక్రియను, అతి సూక్ష్మ పరికరాల సహాయంతో శరీర అంతర్భాగాలలో జరిపే వైద్యసేవలను గురించి విద్యార్థులకు వీడియో ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. వైద్య యంత్రాల సహాయంతో రోగి స్థితిని పరిశీలించి స్పష్టమైన డేటాను అందించడమే కాకుండా రోబోటిక్ సర్జరీ స్థాయికి చేరుకోవడం శుభపరిణామమన్నారు. జీజీహెచ్ ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ పి.తేజస్వని విద్యార్థులు నూతన ఆవిష్కరణల దిశగా వినూత్న ఆలోచనలు చేసి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలకాలని పేర్కొన్నారు. కళాశాల అభివృద్ధికి కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.గోపీచంద్ అందించిన సేవలు చిరస్మరణీయమని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్‌లు తెలిపారు. అనంతరం గోపీచంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ కె.స్వర్ణశ్రీ, పద్మజ, సుధాకర్ తదితరులున్నారు.

చంద్రగిరి టీడీపీ అభ్యర్థికి త్రుటిలో తప్పిన ప్రమాదం



ప్రత్తిపాడు: చంద్రగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పులివర్తి నానికి త్రుటిలో ప్రమాదం తప్పింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. పులివర్తి నాని శనివారం ఉదయం చిత్తూరు నుంచి మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరుగుతున్న వర్క్‌షాపునకు హాజరయ్యేందుకు తన కారులో వెళుతున్నారు. ప్రత్తిపాడు మండలం నడింపాలెం సమీపంలో 16వ నంబరు జాతీయ రహదారిపై ఉన్న అంతర్‌జిల్లా పోలీస్ చెక్‌పోస్టుకు సమీపంలో చిలకలూరిపేట వైపు నుంచి గుంటూరువైపు వెళుతున్న హైవే మెయింటెనెన్స్‌కు చెందిన ట్రిప్పర్ లారీ ముందు వెళుతున్న నాని కారును వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు వెనుక టైరు డిస్క్ పగిలిపోయింది. అయితే ఘటన సమయంలో వాహనాలు నెమ్మదిగా వెళుతుండటంతో ఎవ్వరికీ ఎలాంటి గాయాలు కాలేదని పోలీసులు తెలిపారు. ఈమేరకు నాని కారు డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వి.సోమేశ్వరరావు తెలిపారు.

సెలవు రోజుల్లోనూ పనిచేయనున్న క్యాష్ కౌంటర్లు

నెహ్రూనగర్: వడ్డీ లేకుండా పన్ను చెల్లింపులకు వీలుగా సెలవు రోజులైన ఆది, సోమవారాల్లో కూడా యథావిధిగా నగర పాలక సంస్థ క్యాష్ కౌంటర్లు పనిచేస్తాయని నగర కమిషనర్ కీర్తి చేకూరి శనివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఏప్రిల్ 1వ తేది నుంచి పన్ను బకాయిపై వడ్డీ జమ అవ్వడంతో పాటు, పన్ను చెల్లించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన బకాయిలు సకాలంలో చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఘనంగా వివా ఐబీ గ్రాడ్యుయేషన్ డే


గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

పెదకాకాని: ఆంధ్రప్రదేశ్ తొలి ఐబీ పాఠశాల వివాలో అంతర్జాతీయ స్థాయి ఐబీ (ఇంటర్నేషనల్ బాకలారియేట్) విద్యావిధానంలో ప్రీ ప్రైమరీ విద్యను ముగించుకుని ప్రైమరీ విద్యకు, ప్రైమరీ విద్యను ముగించుకొని మిడిల్ స్కూల్‌కు ప్రవేశం పొందుతున్న విద్యార్థుల గ్రాడ్యుయేషన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రేడ్ 1, గ్రేడ్ 6 తరగతుల్లో ప్రవేశించనున్న విద్యార్థులను అభినందిస్తూ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ సర్టిఫికేట్‌ను ప్రదానం చేశారు. మండలంలోని నంబూరు వివా స్కూల్‌లో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ చదువులో గొప్పగా రాణించాలంటే విద్యార్థులు సంతోషంగా ఉండాలని అన్నారు. విద్యాప్రమాణాలు, క్రమశిక్షణతో వివా అందించే విద్య వారికి ఇష్టపడి చదువుకునే మార్గంగా నిలుస్తుందన్నారు. చదువుతో పాటు ఇతర అంశాలకు ప్రాధాన్యతనిస్తూ, ఒత్తిడిలేని అత్యుత్తమ విద్యను వివా అందిస్తుందని అన్నారు. పిల్లలపై మానసిక ఒత్తిడిని తగ్గించి, విషయ పరిజ్ఞానం, ఇండిపెండెంట్ థింకింగ్, సెల్ఫ్ లెర్నింగ్ వంటి నైపుణ్యాలను ఐబీ విద్యావిధానం అలవరుస్తుందని వివరించారు. వేడుకలో భాగంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక, శాస్త్రీయ, ఆధునిక నృత్యాలు, గీతాలు విశేషంగా అలరించాయి. వివా డైరెక్టర్ లెఫ్టినెంట్ కమాండర్ కేఎస్ రావు, ప్రిన్సిపాల్ చదలవాడ సరళ, ఐబీ ప్రోగ్రాం సంధానకర్త కె.మాధవి, జూనియర్ క్యాంపస్ హెడ్ మామిళ్లపల్లి వేదవాణి, తల్లిదండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

స్ఫూర్తిదాయకం భగత్‌సింగ్ బలిదానం


భగత్ సింగ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

లక్ష్మీపురం: ప్రతి ఏటా మార్చి 23వ తేదీన భగత్ సింగ్ సుఖదేవ్, రాజగురు అమరులైన రోజని, మనదేశాన్ని రాజ్యాంగాన్ని, మతోన్మాద శక్తుల దాడుల నుంచి పరిరక్షించుకుని ఆధునిక భారతాన్ని నిర్మించుకోవడానికి మనమంతా కలిసి కట్టుగా కదులుదామని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు. స్థానిక కొత్తపేట సెంటర్ వద్ద గల భగత్ సింగ్ 93వ వర్ధంతిని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ముందుగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ శాసన సభ్యులు లింగంశెట్టి ఈశ్వరరావు, నడింపల్లి గురుదత్, భగత్‌సింగ్ సేవా సమితి కార్యదర్శి ఎం.వి.ఆర్.ఆర్.భరత్, మురళీకృష్ణ, అవధానుల హరి, ఇందు శేఖర్, తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో రైతు ఉద్యమాలు


సీఐటీయూ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ

పెదకాకాని: ఢిల్లీలో దేశవ్యాప్తంగా రైతులు కొనసాగిస్తున్న ధర్నాకు మద్దతుగా భగత్ సింగ్ స్ఫూర్తితో రైతు ఉద్యమాన్ని కొనసాగించాలని సీపీఐ పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యన్నారాయణ అన్నారు. పెదకాకాని సీపీఐ కార్యాలయంలో శనివారం స్వాతంత్య్ర సమరయోధుడు, విప్లవకారుడు సర్దార్ భగత్‌సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పుప్పాల మాట్లాడుతూ అతి చిన్న వయసులోనే భారతదేశానికి స్వాతంత్య్రం సిద్ధించాలని భగత్‌సింగ్ పోరాడారన్నారు. నేటి యువత భగత్ సింగ్ త్యాగాలను స్మరించుకొని దేశ రక్షణకు నడుం బిగించి రాజకీయాల్లో ప్రవేశించి దేశానికి పట్టుకొమ్మలుగా నిలవాలన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నికల సమయంలో దేశ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నిలబెట్టుకోలేదన్నారు. కె.అగస్టీన్, రెంటాల కుమారి, దర్శి లింగారావు, రామిశెట్టి శ్రీనివాసరావు, బొట్టు శ్రీనివాసరావు, ఎ.కృష్ణ, సీహెచ్ విజయలక్ష్మి, వడ్లమాను రవి పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో...

పెదకాకాని: దేశస్వాతంత్య్రం కోసం చిరునవ్వుతో ప్రాణాలను త్యాగం చేసిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లకు పెదకాకాని సీఐటీయూ ఆఫీసులో శనివారం ఘననివాళులర్పించారు. ముందుగా వారి చిత్రపటాలకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ దేశానికి మతోన్మాద ప్రమాదం పొంచి ఉందని, రానున్న ఎన్నికల్లో అటువంటి శక్తులను, వారితో అంటకాగుతున్న వారిని ఓడించి, లౌకిక శక్తులను గెలపించుకోవాలని అన్నారు. నాలుగు రైతు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీ రైతాంగ పోరాటం సందర్భంగా 175 మంది మరణాలకు కారణమైన మోదీని గద్దె దించేందుకు, భగత్ సింగ్ స్ఫూర్తితో పని చేయాలన్నారు. కె.సత్యనారాయణ, జి.రాజారమేష్, బి.బాబురావు, బి.సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐదు నెలల తరువాత తల్లి ఒడికి చేరిన శిశువు


శిశువును తల్లికి అప్పగిస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో బరువు తక్కువగా ఉందని శిశువును వదిలి వెళ్లిన తల్లి ఒడిలోకి ఐదు నెలల తరువాత శిశువును చేర్చామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ శనివారం తెలిపారు. ఐదు నెలల పాటు జీజీహెచ్ పిల్లల వైద్య విభాగంలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది సదరు శిశువు ఆలనా, పాలనా చూసుకున్నట్లు వెల్లడించారు. గత ఏడాది అక్టోబరు 21న అలేఖ్య జీజీహెచ్‌లో ఆడ శిశువును ప్రసవించిందన్నారు. బరువు తక్కువగా ఉండటంతో అలేఖ్య సహాయకురాలు లక్ష్మీ పిల్లల వైద్య విభాగానికి శిశువును తీసుకొచ్చిందన్నారు. చిన్న పిల్లల వైద్యులు శిశు ఆరోగ్య పరిస్థితి గురించి కౌన్సిలింగ్ ఇచ్చే సమయంలో లక్ష్మిని పిలువగా ఆమె వైద్యులకు సమాచారం ఇవ్వకుండా శిశువును వదిలి ఆసుపత్రి నుంచి వెళ్లిపోయిందన్నారు. శిశువు తల్లి రాకపోవడంతో సివిల్ సర్జన్ ఆర్‌ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్‌కుమార్ కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. అక్టోబరు 21 నుంచి ఐదు నెలలపాటు తల్లి శిశువు వద్దకు రాకపోవడంతో పిల్లల వైద్యులు, నర్సింగ్ సిబ్బంది శిశువు ఆలనా పాలనా చూసుకున్నట్లు వెల్లడించారు. ఆధార్ కార్డు ద్వారా శిశువు తల్లిని గుర్తించి కొత్తపేట పోలీసులు ఆమె నరసరావుపేటలో ఉన్నట్లు విచారణలో తెలుసుకుని పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారన్నారు. పోలీసుల సమక్షంలో శిశువును తల్లికి అప్పగించామన్నారు. శిశువు ఆలనాపాలనా చూసుకున్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ పద్మావతి, డాక్టర్ ఝాన్సీరాణి, డాక్టర్ రవీంద్ర నాయక్, పీజీ వైద్యులు, నర్సింగ్ సిబ్బందిని డాక్టర్ కిరణ్‌కుమార్ అభినందించారు.

ఫార్మసీ రంగంలో విస్తృత అవకాశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఫార్మసీ రంగంలో విద్యార్థులకు విస్తృత అవకాశాలున్నాయని బెంగుళూరులోని రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.రామచంద్రశెట్టి పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో "ఫార్మసీ వృత్తి పరిణామం-ప్రస్తుత స్థితి" అనే అంశంపై శనివారం సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రామచంద్రశెట్టి మాట్లాడుతూ బల్క్‌డ్రగ్, వ్యాక్సిన్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్, పరిశోధనల్లో చోటు చేసుకున్న నూతన పరిణామాలను గురించి వివరించారు. కళాశాల గౌరవ చైర్మన్ డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ ఫార్మసీ రంగంలో పరిశోధనలు, నూతన ఔషధాల ఆవిష్కరణల దిశగా కళాశాలలు, వివిధ విశ్వ విద్యాలయాలతో అవగాహన ఒప్పందాలను కుదుర్చుకోవాలని అన్నారు. సదస్సులో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రవికుమార్, ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ దేసు బ్రహ్మ శ్రీనివాసరావు, ఫార్మ్.డి డైరెక్టర్ పి. సీతారామయ్య పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించిన వ్యక్తిపై కేసు నమోదు

పట్నంబజారు: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తూ ద్విచక్ర వాహనంపై రాజకీయ నాయకుల ఫొటోలు ఉన్న వ్యక్తిపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం రాత్రి 12 గంటల సమయంలో నెహ్రూనగర్‌లో ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెళుతున్న సమయంలో అతని వాహనంపై పవన్ కల్యాణ్ ఫొటో ఉంది. దీన్ని గమనించిన ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ టీం నంబరు 5 అధికారి జి.సురేష్, సిబ్బంది నిలువరించగా, తన వాహనం వదిలి సదరు వ్యక్తి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.